ఎంటెక్ ఎంట్రెన్స్‌లో

మెంగారం యువకుడికి రాష్ట్ర స్థాయిలో 95వ ర్యాంక్



ఉమేష్‌చంద్ర

లింగంపేట, జూన్ 20 : మండలంలోని మెంగారం గ్రామానికి చెందిన గొల్ల ఊరడి ఉమేష్‌చంద్రకు పీజీ ఎంట్రిన్స్ (ఎంటెక్)లో రాష్ట్ర స్థాయిలో 95వ ర్యాంక్ సాధించాడు. హైదరాబాద్‌లోని ఒక ప్రైవేటు కళాశాలలో ఈఈఈలో బీటెక్ పూర్తి చేసిన ఉమేష్‌చంద్ర ఎంటెక్ ఎంట్రెన్స్‌లో 95 ర్యాంక్ సాధించడంతో కళాశాల ప్రిన్సిపాల్ సిబ్బంది ఉమేష్ చంద్రను సత్కరించారు.



నామినేటెడ్ పదవులపై ఆశలు!

- పదవులను ఎప్పుడు భర్తీ చేస్తారోనని కాంగ్రెస్ శ్రేణుల ఎదురుచూపులు
- కార్పొరేషన్ చైర్మన్‌లపైనే ముఖ్యనేతల దృష్టి
- జిల్లా, మండల స్థాయి పదవులపై ద్వితీయ శ్రేణి నేతల ఆశలు
- పదవులకై ముఖ్యనేతలను ప్రసన్నం చేసుకునే పనిలో ఆశావహులు
- జిల్లాలో ఇప్పటికే పలు మార్కెట్ కమిటీ పాలకవర్గాల రద్దు

కామారెడ్డి, జూన్ 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే నామినేటెడ్ పదవులపై ఆ పార్టీ ద్వితీయ, తృతీయశ్రేణి నేతల్లో ఆశలు పెరిగాయి. బీఆర్ఎస్ పాలనలో పదేళ్ల పాటు అధికారానికి దూరమై ఉనికి కోల్పోయిన నేతలంతా కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఊపిరి పీల్చుకున్నారు. మళ్లీ తమ రోజులు వచ్చాయని ఒక నెల అటు ఇటుగా నామినేట్ పదవులు తమకు వరించబోతున్నాయని ఆశలు పెట్టుకున్నారు. అసెంబ్లీ ఎన్నికలు జరుగగానే పార్లమెంట్ ఎన్నికలకు షెడ్యూల్ వచ్చింది. దీంతో నామినేట్ పదవుల భర్తీ అంశం వెనక్కి పోయింది. జిల్లా పరిధిలో గ్రంథాలయ సంస్థ చైర్మన్, పాలకవర్గ పదవులు, మార్కెట్ కమిటీలు, ఆసుపత్రుల కమిటీలు, దేవాదాయ కమిటీల చైర్మన్, పాలకవర్గ సభ్యుల పదవులను నియమించే అవకాశం ఉంది. రాష్ట్రస్థాయిలో వివిధ కార్పొరేషన్‌లకు చైర్మన్ పదవులు, డైరెక్టర్లను భర్తీ చేయాల్సి ఉంది. జిల్లాలో ఉన్న కాంగ్రెస్ ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకులు తమతమ స్థాయిని బట్టి నామినేట్ పదవులపై ఆశలు పెంచుకున్నారు. జిల్లాలో ఇప్పటికే బాన్సువాడకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత కాసుల బాలరాజ్‌కు రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవి దక్కింది. మిగితా కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్ నియోజకవర్గాల్లోనూ చాలా మంది సీనియర్ నేతలు ఉన్నారు. వారంతా నామినేట్ పదవుల కోసం ఎదురు చూస్తున్నారు.

కార్పొరేషన్‌ల వైపు పలువురు నేతల చూపు

జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నేతలు కార్పొరేషన్ పదవుల వైపు చూస్తున్నారు. కాంగ్రెస్ జిల్లా, రాష్ట్రస్థాయి పదవుల్లో కొనసాగుతున్న వారు ఏదైన కార్పొరేషన్ పదవులను దక్కించుకోవాలని భావిస్తున్నారు. కామారెడ్డి నియోజకవర్గంలో గత ఎన్నికల్లో సీఎం రేవంత్‌రెడ్డి పోటీచేసి ఓటమి పాలయ్యారు. రేవంత్‌రెడ్డి కోసం తీవ్రంగా పని చేసిన పలువురు ముఖ్యనేతలకు కార్పొరేషన్ పదవులపై హామీ ఇచ్చినట్లు పార్టీ వర్గాల్లో చర్చసాగుతోంది. అదేవిధంగా ఎల్లారెడ్డి, జుక్కల్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ కైవసం చేసుకోవడంతో స్థానిక ఎమ్మెల్యేలు సైతం తన అనుచర వర్గానికి ఏదైన ముఖ్యమైన నామినేట్ పదవిని అప్పగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఖాళీగా ఉన్న కార్పొరేషన్ చైర్మన్ పదవుల్లో ఏదో ఒకటి ఇప్పించమని ఆశావహులు ప్రజాప్రతినిధులను కోరుతున్నారు. రాష్ట్రస్థాయిలో పదవులు దక్కని పక్షంలో జిల్లా స్థాయిలోనైన ఇప్పించమని కోరుతున్నట్లు సమాచారం.

జిల్లా గ్రంథాలయంతో పాటు మార్కెట్, దేవాలయ కమిటీలు

దశాబ్దాల కాలంగా అధికారంలో లేక పదవులు పొందలేక, పనులు చేయలేక అవస్థలు పడ్డ కాంగ్రెస్ పార్టీలోని ద్వితీయ శ్రేణి నేతలను జిల్లా, మండల స్థాయి నామినేట్ పోస్టులు ఆశలు రేకెత్తిస్తున్నాయి. కాంగ్రెస్ అధిష్ఠానం ఆ పార్టీ ద్వితీయ శ్రేణి నేతలను జిల్లా, నియోజకవర్గ స్థాయిలో వివిధ సంస్థల్లో నామినేట్ చేసేందుకు కసరత్తు చేస్తోంది. జిల్లాలో గ్రంథాలయ సంస్థ, పది వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉన్నాయి. ఇప్పటికే జిల్లా గ్రంథాలయ పాలకవర్గాన్ని ప్రభుత్వం రద్దు చేసింది. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవులకు పలువురు కాంగ్రెస్ నేతలు పోటీ పడుతున్నారు. ఒక్కో దానిలో చైర్మన్, వైస్ చైర్మన్‌లతో పాటు మరో 12 మంది డైరెక్టర్‌లను నియమించాల్సి ఉంటుంది. అంటే ఒక్కో మార్కెట్ కమిటీలో 14 మందికి అవకాశం దక్కుతోంది. కామారెడ్డి నియోజకవర్గంలో కామారెడ్డి, భిక్కనూర్ మార్కెట్ కమిటీలు ఉండగా ఎల్లారెడ్డి నియోజకవర్గంలో సదాశివనగర్, గాంధారి, ఎల్లారెడ్డి, బాన్సువాడ నియోజకవర్గంలో బాన్సువాడ, బీర్కూర్, జుక్కల్ నియోజకవర్గంలో పిట్లం, మద్నూర్, బిచ్కుంద మార్కెట్ కమిటీలు ఉన్నాయి. ఈ మార్కెట్ కమిటీలో నామినేట్ పోస్టులతో భర్తీ చేస్తే కాంగ్రెస్‌లోని వంద మందికి పైగా పదవులు పొందే అవకాశం ఉంది. వీటితో పాటు జిల్లాలోని పలు ఆలయ కమిటీలను నామినేట్ చేస్తారు. చైర్మన్‌తో పాటు డైరెక్టర్‌లు ఉంటారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లోగా భర్తీ చేసేనా?

నామినేట్ పదవుల నియామకాల ప్రక్రియ చేపట్టకపోతే స్థానిక సంస్థల ఎన్నికలు వచ్చి మరో 6 నెలల పాటు పదవుల పంపిణీ వాయిదా పడే అవకాశం లేకపోలేదనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే పదవులను భర్తీ చేస్తే అవి దక్కని వారు పార్టీకి స్థానిక ఎన్నికల్లో నష్టం చేకూర్చే అవకాశం లేకపోలేదు. ఎన్నికల తర్వాత పదవుల భర్తీ చేపడితే నాయకులందరు పార్టీ విజయానికి కృషి చేస్తారనే అభిప్రాయం నాయకత్వంలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇదే జరిగితే 2025లో నామినేటెడ్ పదవుల భర్తీ జరిగే అవకాశం ఉంది. బీఆర్ఎస్ హయాంలో పార్టీ రాష్ట్ర నాయకత్వం జాప్యం చేయడం, భర్తీ చేయాలనుకున్న సమయంలో ఎన్నికలు ఇతరత్రా అంశాలు ఆటంకాలు ఏర్పడడంతో చాలా పదవులు భర్తీకే నోచుకోలేదు. మూడు విడతలుగా నియామకాలు జరిగే అవకాశం ఉన్న ఒకటి రెండు సార్లు మాత్రమే పదవుల భర్తీ జరిగింది. కొందరికి రెండేసి సార్లు అవకాశాలు లభించగా కొందరికీ అసలే నెరవేరకుండా పోయింది. కాంగ్రెస్ హయాంలో కూడా ఇలాంటి పరిస్థితి పునరావృతం అవుతుందా అలా అయితే తమ పరిస్థితి ఏమిటని ఆశావహులు ఆందోళన చెందుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలోపే నామినేట్ పదవుల భర్తీ చేయాలని కోరుతున్నారు.

పరిశుభ్రత వల్ల రోగాల బారి నుంచి రక్షించుకోవచ్చు

కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి టౌన్, జూన్ 20: పరిశుభ్రత పాటించడం వల్ల రోగాల భారి నుంచి రక్షించుకోవచ్చని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. 14వ జాతీయ నులిపురుగు నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ముదాంగల్లిలో గల జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో విద్యార్థులకు అల్బెండాజోల్ మాత్రలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడుపులో నట్టలు ఉన్నట్లయితే రక్తహీనత, పోషకాహార లోపం, ఆకలి లేకపోవడం, కడుపు నొప్పి వంటి వాటితో బాధపడతారని అన్నారు. పిల్లలు ఆరోగ్యంగా ఉంటేనే దేశభవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని, ఆ దిశగా ప్రభుత్వం ఏటా ఫిబ్రవరి, జూన్ మసాలలో రెండు పర్యాయాలు అల్బెండాజోల్ మాత్రలు ఇస్తున్నదని అన్నారు. ఈ మాత్రలు వేసుకోవడం వల్ల రెండు పర్యాయాలు అల్బెండాజోల్ మాత్రలు ఇస్తుందని అన్నారు. ఈ మాత్రలు వేసుకోవడం వల్ల కడుపులో పురుగులు నట్టలు నశిస్తాయని, అనీమియాను నియంత్రించవచ్చని పిల్లలు నశించి ఆరోగ్యవంతంగా పెరుగుతారని అన్నారు. జిల్లాలో 1 నుంచి 19 సంవత్సరాలలోపు 2,50,254 పిల్లలున్నారని గుర్తించడం జరిగిందని, వారికి వంద శాతం మాత్రలు అందేంచేలా కార్యాచరణ రూపొందించి నేడు మాత్రలు అందిస్తున్నామని తెలిపారు. ఏదైన కారణం చేత మాత్రలు వేసుకోని వారికి తిరిగి ఈనెల 27 వరకు మాత్రలు వేయించి వంద శాతం లక్ష్యం పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. రెండు సంవత్సరాలలోపు పిల్లలకు సగం మాత్ర, రెండు నుంచి మూడు సంవత్సరాలలోపు పిల్లలకు ఒక మాత్రను నలిపి ఇవ్వాలి. 3 నుంచి 19 సంవత్సరాలలోపు పిల్లలకు చప్పరించేలా వేయించాలని అధికారులకు సూచించారు. అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాల్లో ఏ ఒక్కరిని విడిచి పెట్టకుండా మాత్రలు వేయాలని అన్నారు. ఇతర ప్రాంతాలు, రాష్ట్రాల నుంచి వచ్చిన వారికి సైతం అల్బెండాజోల్ మాత్రలు పిల్లలకు వేయించాలని, ఎట్టి పరిస్థితుల్లో మాత్రలు ఇంటికి తీసుకెళ్లేందుకు అనుమతించకుండా చూడాలని అన్నారు. అనంతరం పాఠశాలల్లోని అమ్మ ఆదర్శ పాఠశాలల కింద చేపట్టిన టాయిలెట్స్ బ్లాక్స్, మంచినీటి ట్యాంక్, కుళాయిలు, తరగతి గదులలో లైట్లు, ఫ్యాన్స్ ఏర్పాటు, కిటికీల మరమ్మతులు పనులు ప్రగతిని పరిశీలించి ప్రధానోపాధ్యాయులు, మహిళా సమాఖ్య సభ్యురాలిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా



విద్యార్థులకు మాత్రలను వేస్తున్న కలెక్టర్


ప్రభుత్వ పాఠశాలలు తీర్చిదిద్దుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి చంద్రశేఖర్, డీఈవో రాజు, ఎంఈవో ఎల్లయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ, వైస్ చైర్‌పర్సన్ వనిత, వార్డు కౌన్సిలర్ ప్రముఖ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో అధికారులు అలసత్వం వహించొద్దు

సదాశివనగర్: అభివృద్ధి పనుల్లో అధికారులు ఎలాంటి అలసత్వం వహించవద్దని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. గురువారం మండలంలో అమ్మ ఆదర్శ పాఠశాల పనులు, డంప్‌యార్డు, నర్సరీల పనులను పరిశీలించి అధికారులకు, సిబ్బందికి ఆదేశాలిచ్చారు. మండల కేంద్రంలోని డంప్‌యార్డును పరిశీలించి సేగ్రిగేషన్ వల్ల వస్తున్న ఆదాయం తక్కువగా ఉన్నదని, డ్రైవేస్ట్ ఇంకా బాగా జరిపి ఆదాయం పెంపొందించుకోవాలన్నారు. ధర్మారావుపేటలో అమ్మ ఆదర్శ పాఠశాల కింద చేపట్టిన పనుల పురోగతిని పరిశీలించి త్వరగా పనులు పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. నర్సరీని పరిశీలించి ఇంకా మెరుగుపరచాలని, మొక్కల బ్లాక్‌లు క్రమపద్ధతిలో పెట్టాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. కల్వరాల హైస్కూల్‌లో అమ్మ ఆదర్శ పాఠశాల పనులు పూర్తయినట్లు తెలిపారు. ఎంపీ పీఎస్ పాఠశాలలో 50శాతం మేర పనులు పూర్తయినట్లు గుర్తించారు. త్వరగా పనులు పూర్తిచేసి ఎంబీ రికార్డు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మిషన్ భగీరథ కింద ఇంటింటా నీటి కుళాయి సర్వే పనులు ఎంత వరకు వచ్చాయని, ఎలా చేస్తున్నారని పంచాయతీ కార్యదర్శికి అడుగగా డోర్‌లాక్ ఉన్నవి పెండింగ్‌లో ఉన్నాయని త్వరలో సర్వే పూర్తి చేస్తామని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థులతో మాట్లాడి మొక్క లను నాటారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గంగా ప్రసాద్, ఎంపీడీవో సంతోష్‌కుమార్, ఎంపీవో సురేందర్‌రెడ్డి, ఎంఈవో యూసుఫ్, మిషన్ భగీరథ డీఈ, ఏఈ, పంచాయతీరాజ్ అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన టీఎన్జీవోస్

కామారెడ్డి రూరల్ : కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌ను గురువారం టీఎన్జీవోస్ ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను శాలువాతో సత్కరించి పూల మొక్కను, పుస్తకాలను అందజేసి ఘన స్వాగతం తెలిపారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్‌రెడ్డి, కార్యదర్శి బి.సాయిలు, నాగరాజు, చక్రధర్, రాజేశ్వర్, గణేష్, రాజ్యలక్ష్మి, నవిత, సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



చదువుకొనేదెలా?

- ప్రైవేటు పాఠశాలల్లో అధికంగా ఫీజుల వసూళ్లు
- అధికారులు హెచ్చరించినా పుస్తకాలు, నోట్ బుక్కుల విక్రయం
- అధికారులకు చూపించే సర్టిఫికెట్ ఒకరిది.. పాఠశాలల్లో బోధించేది మరొకరు
- కొన్ని పాఠశాలలు ఇప్పటికీ రెన్యూవల్ చేసుకోలేదు

భిక్కనూరు, జూన్ 20: తమ పిల్లలను బాగా చదివించి మంచి ప్రయోజకుడిని చేద్దామని కలలు కని ప్రైవేటు పాఠశాలల్లో చేర్పిస్తే పిల్లల తల్లిదండ్రుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని చాలా పాఠశాలల యాజమాన్యాలు వారి నుంచి ముక్కుపిండి అధికంగా ఫీజులు వసూళ్లు చేస్తున్నారు. ఫీజులతో పాటుగా పాఠశాల లోగోతో నోట్ బుక్కులు, పాఠ్యపుస్తకాలను ఎక్కువ ధరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఎంతో ఆశతో ప్రభుత్వ పాఠశాలను కాదనుకుని ప్రైవేటుకు పిల్లలను పంపిస్తే చాలా పాఠశాలల యాజమాన్యాలు పిల్లల తల్లిదండ్రులను మోసం చేస్తూ ఫీజులు, పుస్తకాల పేరుతో నిలువునా దోచుకుంటున్నారు. 10వ తరగతిలో 10జీపీఏ వచ్చే కొందరు విద్యార్థుల ఫొటోలతో గ్రామాల్లో పెద్దఎత్తున పోస్టర్లు వేసి జిల్లాలో, మండలంలో తమ పాఠశాల గొప్పని ప్రచారం చేసుకుంటు విద్యార్థుల తల్లిదండ్రులకు ఆకాశంలో బాగోతం చూపించి వారి పిల్లలను పాఠశాలల్లో చేర్పించుకుంటున్నారు. అధికారులు ఎంత చెప్పినా.. హెచ్చరించినా నిబంధనలు పాటించకుండా కొన్ని ప్రైవేటు పాఠశాలల యజమానులు ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారు. విద్యార్థి సంఘాల నాయకులు గానీ తల్లిదండ్రులు గానీ ఫీజులు, సమస్యలపై ప్రశ్నిస్తే వారికున్న రాజకీయ పలుకుబడితో రాజీ కుదర్చడమో లేదంటే బెదిరించడమో చేస్తున్నారు. చాలా పాఠశాలలు విద్యా సంవత్సరం ప్రారంభమైనా ఇప్పటికీ రెన్యూవల్ చేసుకోలేదు.

అధికారులు హెచ్చరించినా పుస్తకాలు, నోట్‌బుక్కుల విక్రయం

జిల్లా, మండల అధికారులు ఎన్నిసార్లు హెచ్చరించిన చాలా ప్రైవేటు పాఠశాలల్లో పుస్తకాలు, నోట్ బుక్కులు విక్రయించడం మానడం లేదు. జిల్లాలోని చాలా పాఠశాలల్లో వారి పాఠశాల పేరుతో నోట్ బుక్కులను తయారు చేయించి బయట మార్కెట్‌లో ఉన్న దానికంటే ఎక్కువ రేటుకు విద్యార్థులకు విక్రయిస్తున్నారు. పాఠశాలల్లో కాకుండా బయట కొనుగోలు చేస్తే ఆ నోట్ బుక్కులను పాఠశాల ఆవరణలోకి అనుమతించడం లేదు. పేద, మధ్య తరగతి పిల్లల తల్లిదండ్రులు అంత మొత్తం పెట్టి తాము కొనుగోలు చేయలేమని బయట తక్కువ రేటులో కొనుగోలు చేసుకుంటామని ఆయా పాఠశాలల యాజమాన్యాలను వేడుకుంటున్నా వారు ఏ మాత్రం కనికరించడం లేదు. తప్పకుండా తమ పాఠశాలల్లోనే నోట్ బుక్కులు, పుస్తకాలను కొనుగోలు చేయాల్సిందేనని తేల్చి చెబుతున్నారు. దీంతో చేసేదేమి లేక వారి పిల్లల కోసం అప్పో, సప్పో చేస్తున్నారు.

అధికారులకు చూపించే సర్టిఫికెట్ ఒకరిది పాఠశాలలో బోధించేది మాత్రం మరొకరు

ప్రైవేటు పాఠశాలను ప్రారంభించే సమయంలో, పాఠశాల రెన్యూవల్ సమయంలో అవసరమయ్యే సర్టిఫికెట్లతో పాటుగా పాఠశాలల్లో బోధించే ఉపాధ్యాయుల సర్టిఫికెట్లను సైతం ఆర్‌జేడీ, జిల్లా, మండల అధికారులకు అందజేస్తారు. ఆ సమయంలో పాఠశాలల్లో బోధించే వారివి కాకుండా డీఎడ్, బీఈడీ, పీజీ పూర్తి చేసిన వేరే వారి సర్టిఫికెట్లను జత చేస్తున్నట్లు సమాచారం. చాలా పాఠశాలల్లో డీఎడ్, బీఎడ్, పీజీ పూర్తి చేసిన వారు కాకుండా ప్రైమరీ స్థాయికి పదవ తరగతి, ఇంటర్ వారితో, ఆరవ తరగతి నుంచి పదవ తరగతి వరకు కొందరు డీఎడ్, బీఎడ్, పీజీ వారితో పాటుగా డిగ్రీ పాస్, ఫెయిల్ అయిన వారితో పిల్లలకు పాఠాలు బోధిస్తూ ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రైవేటు పాఠశాలల్లో చదివే చాలా మంది పిల్లలకు అటు తెలుగు, ఇటు ఇంగ్లీష్ చదవడం, రాయడం రావడంలేదని విద్యార్థి సంఘాల ప్రతినిధులు ఆరోపిస్తున్నారు. జిల్లాలోని ప్రతీ ప్రైవేటు పాఠశాలను అధికారులు తనిఖీ చేస్తే చాలా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల బండారం బయటపడుతుందని కోరుతున్నారు.

ఇప్పటికీ రెన్యూవల్ చేసుకోని పాఠశాలలు

భిక్కనూరు మండలంతో పాటుగా చాలా మండలాల్లోని ప్రైవేటు పాఠశాలలు రెన్యూవల్ పూర్తి కాగా కొత్త విద్యాసంవత్సరం ప్రారంభమైనా ఇప్పటికీ ఆ పాఠశాలల యాజమాన్యాలు రెన్యూవల్ చేసుకోవడం లేదు. రెన్యూవల్ పూర్తి అయిన వారు రెన్యూవల్ చేసుకోకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారు. ఈ విషయం తెలియని విద్యార్థుల తల్లిదండ్రులు ఆ పాఠశాలల్లోనే వారి పిల్లలను చేర్పిస్తున్నారు.

కొత్త విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే రెన్యూవల్ చేసుకోవాలి

ఎల్లయ్య, ఎంఈవో

రెన్యూవల్ పూర్తి అయిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు తప్పకుండా కొత్త విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే రెన్యూవల్ చేసుకోవాలి. రెన్యూవల్ పూర్తి అయిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలను రెన్యూవల్ తేది ముగిస్తుందని ఎన్నిసార్లు చెప్పినా వారు ఇప్పటికీ రెన్యూవల్ చేసుకోవడం లేదు. భిక్కనూరు మండలంతో పాటుగా ఆయా మండలాల్లోని పలు ప్రైవేటు పాఠశాలల్లో 8,9,10వ తరగతుల నిర్వహణకు రెన్యూవల్ పూర్తి అయ్యింది. ప్రస్తుతం ఆ పాఠశాలలకు 8,9,10 తరగతుల నిర్వహణకు ఇప్పటి వరకు అనుమతి రాలేదు.



అక్రమ లే అవుట్‌లపై విచారణ జరిపించాలి

సీఎస్‌కు ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి వినతి



సీఎస్‌కు వినతి పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

కామారెడ్డి టౌన్, జూన్ 20: కామారెడ్డి నియోజకవర్గ పరిధిలోని అక్రమ లేవుట్‌లపై విచారణ జరిపించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వివిధ లేఅవుట్ ప్లాన్‌లను పరిశీలించాలని, ఓ లేఅవుట్‌లో 13 ఎకరాల 30 గుంటలకు గాను అందులో రూ.20కోట్ల విలువ గల 3 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించారని, 2004 నుంచి ఇప్పటి వరకు చేపట్టిన లేఅవుట్‌లు, ప్రైవేట్ స్థలాలను ఆక్రమించిన ప్రభుత్వ స్థలాలను, ఓపెన్ స్థలాల్లో చేపట్టిన నిర్మాణాలపై విచారణ జరపాలని కోరినట్లు తెలిపారు. కామారెడ్డి మున్సిపల్, పక్కనే ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో నీటి పారుదల శాఖ భూములు, నాలాలు అక్రమంగా ఆక్రమణలకు గురయ్యాయని దీంతో వర్షపు నీరు ఎక్కడికక్కడ నిలిచిపోతుందని, చెరువుల, కుంటలలోకి నీరు వెళ్లకుండా నిర్మాణాలు చేపట్టారని తెలిపారు. కలెక్టరేట్ కార్యాలయం వెనుక గల జయశంకర్ కాలనీలో 150కోట్ల విలువైన 25 ఎకరాల ప్రభుత్వ భూములను కొందరు వ్యక్తులు ఆక్రమించారని మొత్తంగా రూ.400కోట్ల భూములు అన్యాక్రాంతం కాబడ్డాయని సీఎస్ దృష్టికి తీసుకెళ్లినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

మద్యం, కల్లు అక్రమంగా అమ్ముతున్న వారిపై కేసుల నమోదు

రాజంపేట, జూన్ 20: మండలంలో మద్యం, కల్తీ కల్లును అక్రమంగా అమ్ముతున్న వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు కొందరిని అరెస్టు చేశామని జిల్లా అబ్కారీశాఖ అధికారి రవీందర్‌రాజు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం మండల సర్వసభ్య సమావేశంలో జడ్పీటీసీ కొండ హనుమండ్లు అక్రమ మద్యం, కల్తీ కల్లుపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని పేర్కొనడంతో గురువారం దోమకొండ అబ్కార్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్‌రావుతో పాటు సిబ్బందితో మండలంలోని మద్యం, కల్తీ కల్లు అక్రమ అమ్మకాలపై నిఘా పెట్టి తరచూ దాడులు నిర్వహిస్తున్నారని తెలిపారు. జనవరి నుంచి ఇప్పటి వరకు 6,72,115 విలువ గల అక్రమ మద్యం, కల్తీ కల్లు అమ్మకాలను స్వాధీనం చేసుకుని 18 కేసులు నమోదు చేయడంతో పాటు ముగ్గురిని అరెస్టు చేశారని అన్నారు. కల్తీ కల్లు అని అనుమానాస్పదంగా ఉన్న 5 కల్లు నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపగా క్లోరల్ హైడ్రేడ్ కాని డైజోఫామ్ కలుప లేదని నిర్ధారణ అయిందని తెలిపారు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌లు జిల్లాలోని లైసెన్స్ కలిగిన అన్ని కల్లు దుకాణాలను తరచూ తనిఖీ చేస్తూ కల్తీకల్లు అమ్మడం నేరమని, శిక్షార్హులని హెచ్చరిస్తున్నామని తెలిపారు. అదేవిధంగా అక్రమ మద్యం అమ్మకాలు జరగకుండా అధికారులు తనిఖీ చేస్తున్నారని జిల్లా ఎక్సైజ్ అధికారి రవీందర్‌రాజు తెలిపారు.



కల్లు శాంపిల్లను సేకరిస్తున్న ఎక్సైజ్ అధికారులు

ఎస్‌బీఐ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

పెద్దబజార్, జూన్ 20: నగరంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మెయిన్ బ్రాంచ్ కార్యాలయంలో గురువారం కామ్రేడ్ తారక్‌నాథ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ ఉద్యోగులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఎస్‌బీఐ డీజీఎస్ ఎంపీ రమేష్ మాట్లాడుతూ.. సామాజిక సేవలో భాగంగా రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేసిన ఎస్ బీఐ ఉద్యోగులు నేటి సమాజానికి ఆదర్శంగా నిలవడం జరిగిందన్నారు. తలసేమియా చిన్నారుల కోసం రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ బీఐ సిబ్బంది రాజేశ్వర్, శ్రీనివాస్, గురునాథ్, ఆర్ఎస్ శ్రీనివాస్, అర్వింద్‌లతో పాటు వివిధ శాఖల లోకల్ కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

పెద్దబజార్, జూన్ 20: నీట్‌పరీక్ష లీకేజీ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు అన్నారు. గురువారం నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా వైద్య విద్యార్థుల కోసం కేంద్ర ప్రభుత్వం నీట్‌పరీక్షను ఎన్‌టీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తుందని ప్రధానంగా ఆయా రాష్ట్రప్రభుత్వాలు పేపర్ లీకేజీ, ఇతర అవకతవకలకు పాల్పడుతున్నాయని అన్నారు. 2019 నుంచి దేశవ్యాప్తంగా ఒకే పరీక్ష విధానాన్ని రూపొందించి నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సంవత్సరం 24లక్షలకు పైగా విద్యార్థులు నీట్‌పరీక్ష రాయడం జరిగిందని ఈ పరీక్షలకు బీజేపీ పాలిత రాష్ట్రాలైన గుజరాత్, బీహార్ రాష్ట్రాల్లో ఒక్కొక్క విద్యార్థి దగ్గర 30 నుంచి 40లక్షల రూపాయల వరకు వసూలు చేసి పేపర్ లీకేజీకి పాల్పడటం జరిగిందన్నారు. ప్రభుత్వం వెంటనే బాధ్యత వహించి నీట్ పరీక్ష అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పెద్దివెంకట్రాములు, నూర్జహాన్, శంకర్ గౌడ్, వెంకటేశ్, జిల్లా కమిటీ సభ్యులు సుజాత, విఘ్నేష్, మహేష్, కటారి రాములు, సూరి, తదితరులు పాల్గొన్నారు.

కామ్రెడ్ డీవీ కృష్ణ స్మారకస్థూపం ఆవిష్కరణ

బోధన్‌రూరల్,జూన్20: మండలంలోని పెంటాఖుర్దు గ్రామానికి చెందిన కామ్రెడ్ డీవీ కృష్ణ రెండోవర్ధంతి సందర్భంగా ఆయన స్మారక స్తూపం ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నార. కార్యక్రమాన్ని గ్రామస్థులతో పాటు విప్లవ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ప్రజాపంథా బోధన్ డివిజన్ కార్యదర్శి మల్లేష్ అన్నారు. గురువారం పెంటాఖుర్దు గ్రామంలో విప్లవ ఉద్యమ నేత శ్రామికవర్గ యోధుడు డీవీ కృష్ణ కరపత్రాలను గ్రామస్థులకు పంపిణీ చేశారు. నిరుపేదల కోసం ఆయన చేసిన పోరాటాలను కొనియాడారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి పడాల శంకర్, సహాయ కార్యదర్శి సుల్తాన్ సాయిలున్నారు.





పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

● అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్

నిజామాబాద్ అర్బన్, జూన్ 20: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఆయా పరీక్షలను జిల్లాలో ప్రశాంత వాతావరణంలో సాఫీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ ఎస్.కిరణ్‌కుమార్ అధికారులకు సూచించారు. ఈనెల 24 నుంచి 29 వరకు జరుగనున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాల వెల్ఫేర్ ఆఫీసర్ల నియామక రాత పరీక్షతో పాటు ఈనెల 30 నుంచి జూలై 4 వరకు జరుగనున్న డివిజనల్ అకౌంట్ ఆఫీసర్ నియామక రాత పరీక్షను పురస్కరించుకొని కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో సంబంధిత అధికారులతో గురువారం ఆయన సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ నెల 23న నిర్వహించనున్న నీట్ పీజీ ఎగ్జామ్ ఏర్పాట్లపై సమీక్ష జరుపుతూ పలు సూచనలు చేశారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో సజావుగా పరీక్షలు జరిగేలా ఏర్పాట్లు చేయాలన్నారు. నియామక రాత పరీక్షలలో నిర్ణీత తేదీలలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12.30ల వరకు, మధ్యాహ్నం 2.30ల నుంచి సాయంత్రం 5గంటల వరకు రెండు సెషన్స్‌లలో పరీక్షలు కొనసాగుతాయని, నీట్ పీజీ ఎగ్జామ్ ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు జరుగుతుందన్నారు. పరీక్షలు సాఫీగా కొనసాగేలా చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, రూట్ ఆఫీసర్లు సమర్థవంతంగా విధులు నిర్వహించాలని సూచించారు. పరీక్ష కేంద్రాల్లో అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని సమయానికి అనుగుణంగా ఆర్టీసీ బస్సులు నడపాలన్నారు.


అధికారులతో సమీక్షిస్తున్న అదనపు కలెక్టర్

కడుపు నొప్పి భరించలేక యువకుడు ఆత్మహత్య

ఖిల్లా, ,జూన్ 20 : కడుపు నొప్పి భరించలేక యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం ఉదయం మూడోటౌన్ పరిధిలోని అయ్యప్ప టెంపుల్ సమీపంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. నగరానికి చెందిన గొండల రాహుల్ (28) ఎంబీఏ చేసి అయ్యప్ప టెంపుల్ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న ఇంటినిర్మాణ పనులు చూసుకుంటున్నాడు. తండ్రి వెంకటేశ్వర్లు వృత్తిరీత్యా మహబూబ్‌నగర్‌లో ఉంటున్నాడు. ఇంటినిర్మాణ పనులు జరుగుతుండడంతో అప్పుడప్పుడు వచ్చి చూసుకుని వెళ్తుంటాడు. రాహుల్‌కు గతంలో కూడా కడుపునొప్పి వచ్చేదని చికిత్స చేయించిన అనంతరం తగ్గిందని, తిరిగి కడుపునొప్పి రావడంతో వైద్యుల వద్దకు తీసుకెళ్లినట్లు మృతుడి తండ్రి వేంకటేశ్వర్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తెలిపారు. పరీక్ష చేసిన వైద్యులు మృతుడికి స్కానింగ్ చేసి అపెండిసైటిస్ ఉందని చెప్పడమే కాకుండా చికిత్స చేయాలని సూచించారని తెలిపారు.







జిల్లా జైలులోని ఖైదీలకు వైద్య పరీక్షలు

నిజామాబాద్ రూరల్, జూన్ 20: జిల్లా కేంద్రంలోని సారంగాపూర్‌లోని జిల్లా జైలులో శిక్షననుభవిస్తున్న ఖైదీలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. బుధవారం డీఎంహెచ్‌వో డాక్టర్ తుకారాం రాథోడ్ ఆధ్వర్యంలోని వైద్య బృందం జిల్లా జైలుకు చేరుకున్నారు. జైలు సూపరిటెండెంట్ జి.ప్రమోద్ కుమార్ పర్యవేక్షణలో వైద్యబృందం ఖైదీలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. సురక్షిత లైంగిక పద్ధతులు పాటించకపోవడం వల్ల వచ్చే ఎయిడ్స్ వ్యాధిని వివరించారు. ఎయిడ్స్ పక్కా ప్రతి ఒక్కరు అవగాహన కల్గి ఉండాలని సూచించారు. రెండు వారాలకు మించి దగ్గు వస్తుంటే డాక్టర్‌తో పరీక్షించుకోవాలన్నారు. ఖైదీలకు టీబీ స్కీనింగ్, హెచ్ఐవీ పరీక్షలు నిర్వహించామన్నారు. టీబీ లక్షణాలు కనపడిన 19 మంది ఖైదీల శాంపిల్స్ సేకరించినట్లు వైద్యాధికారులు తెలిపారు. జైలులో మొత్తం 411 మంది ఖైదీలున్నారని వీరందరికీ పరీక్షలు నిర్వహించేందుకు మూడు రోజుల పాటు పరీక్షలు నిర్వహిస్తారని జైలు సూపరింటెండెంట్ జి.ప్రమోద్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ జి.ప్రమోద్ కుమార్‌తోపాటు జైలర్ రాజశేఖర్, డీఎంహెచ్‌వో డాక్టర్ తుకారం రాథోడ్, జిల్లా టీబీ కంట్రోలర్ అధికారి సంతోష్, జైలు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జయకుమార్, జైలు ఫార్మాసిస్టు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


ఖైదీలకు టీబీ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

'దివ్యాంగుల చట్టాల అమలులో ప్రభుత్వాలు విఫలం'

బోధన్‌రూరల్,జూన్20: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దివ్యాంగుల చట్టాలు అమలు చేయడంలో విఫలమయ్యాయని వికలాంగులకు పింఛన్ పెంచకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని వికలాంగుల హక్కుల జాతీయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అడివయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.బస్వరాజ్ పాటిల్ అన్నారు. గురువారం బోధన్ పట్టణంలోని ఉర్దూఘర్‌లో వికలాంగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2011జనాభా లెక్కల ప్రకారం దేశంలో 2.21శాతం మంది వికలాంగులు ఉన్నారని గణాంకాలు చెబుతున్నాయన్నారు. ఎన్నికల సమయంలో ప్రభుత్వం ఇచ్చినహామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ వికలాంగులకు స్వయం ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం ప్రైవేటు భాగస్వామ్యంతో ప్రత్యేక పథకాన్ని ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న వివాహ ప్రోత్సహ నిధులు వెంటనే విడుదల చేయాలన్నారు. రాష్ట్రంలో వికలాంగుల సంక్షేమ శాఖ అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వికలాంగులకు న్యాయంచేయాలని ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం ప్రకారం పింఛన్ పెంచాలని లేనియెడల రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేపడతామన్నారు. బోధన్ పట్టణంలో జులై 31న వికలాంగుల హక్కుల సమితి ఆధ్వర్యంలో 3వ జిల్లా మహసభను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షులుతోపాటు ప్రముఖులు రానున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏశాల గంగాధర్, జిల్లా నాయకులు నాజీర్, రాములు, గోపాల్, ఎల్లయ్య, సావిత్రి, బీరప్ప, అమీనా, రాజు, గంగారాం పాల్గొన్నారు.

అల్బెండజోల్ మాత్రలు తప్పనిసరి వేసుకోవాలి

● డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో రమేష్

ఆర్మూర్‌రూరల్, జూన్20: 19 ఏండ్ల లోపు వారికి అల్బెండజోల్ మాత్రలు తప్పనిసరి వేసుకోవాలని ఆర్మూర్ డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో రమేష్ అన్నారు. గురువారం జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో అల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్ మాట్లాడుతూ పిల్లలు మట్టిలో ఆడిన తర్వాత చేతులను శుభ్రంగా కడుక్కోవాలని, పెరిగిన వేలి గోర్లను వెంట వెంటనే కత్తిరించుకోవాలని, లేని పక్షంలో వీటి ద్వారా మనం ఆహారం తీసుకునే సమయంలో మట్టి కడుపులోకి వెళ్ళి నులి పురుగులను తయారు చేసే అవకాశం ఉంటుందన్నారు. నులి పురుగులు కడుపులో ఉండడం వల్ల తరుచుగా కడుపునొప్పి రావడంతో పాటు రక్తహీనత ఏర్పడుతుంన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రవీంధర్, ఆర్మూర్ సబ్‌యూనిట్ అధికారి సాయి, వైద్యసిబ్బంది జక్కుల మోహన్, శ్యామల, స్రవంతి, మమత, సుభద్ర, శిరీష, తదితరులు పాల్గొన్నారు.

'మానసికంగా, శారీరకంగా ధృడంగా ఉండాలి'

పెద్దబజార్, జూన్ 20: విద్యార్థులు మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉండాలని జెడ్పీ ఛైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అన్నారు. గురువారం నగరంలోని అర్సపల్లిలోగల జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యా, వైద్య శాఖ అధికారులు విద్యార్థుల సమక్షంలో ఘనంగా జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నులిపురుగులను పూర్తిగా నిర్మూలించాలని అప్పుడే విద్యార్థులల్లో ఎదుగుదల ఉంటుందని ఆరోగ్యమే మహాభాగ్యం అని ఇలాంటి ప్రభుత్వ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నగర మేయర్ దండునీతూకిరణ్ మాట్లాడుతూ విద్యార్థులందరూ ఆరోగ్యకరమైన జీవితం గడపాలని ఆరోగ్యంగా ఉంటేనే విద్యను అభ్యసించి ఉన్నతంగా ఎదగగలుగుతారని అన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత లాంటివి ఉంటేనే నులిపురుగులు దరిచేరవని వాటి నిర్మూలన కోసం ప్రభుత్వాలు దేశ, రాష్ట్ర స్థాయిలో ఉచిత ఆల్బెండజోల్ మాత్రలు ప్రత్యేకంగా అందిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారాం, జిల్లా టీకాల అధికారి డాక్టర్ అశోక్, వైద్యులు సామ్రాట్ యాదవ్, పాఠశాల హెడ్‌మాస్టర్, మండల విద్యాధికారి, వైద్య, విద్య అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు బాలురకు గాయపర్చిన ట్రాక్టర్ డ్రైవర్‌కు మూడునెలల జైలు

ఎడపల్లి, జూన్ 20: 2017వ సంవత్సరంలో ఏపి 25 ఏఫ్ 6466, ట్రాలీ ఏపి 01 జీ 5823 ట్రాక్టర్‌తో సైకిల్‌పై వెలుతున్న ఇద్దరు యువకులను ఢీ కొట్టి గాయ పర్చగా కేసు నమోదు చేసి కోర్టుకు అప్పగించారు. సాక్ష్యాదారాలను పరజశీలించిన అనంతరం అజాగ్రత్తగా ట్రాక్టర్ నడిపి ఇద్దరు బాలురులను గాయపరిచినందుకు అదనపు సెషన్ జడ్జి సాయి శివ ఎడపల్లి గ్రామానికి చెందిన మరాఠి నాగరాజు తండ్రి పీరాజీ అనే ట్రాక్టర్ డ్రైవర్‌కు 3 నెలల సాదారణ జైలు శిక్ష విధిస్తూ, గాయపడిన వారికి 5 వేలు, 10 వేల చొప్పున నష్టపరిహారం అందించాలని తీర్పును ఇచ్చారు.

'మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'

ఆర్మూర్‌రూరల్, జూన్20: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం మధ్యాహ్న భోజన కార్మిక సంఘాల నాయకులు ఎంఈవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనకార్మిక సంఘం ఆర్మూర్ మండల కార్యదర్శి జక్కం సుజాత మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. వంట పాత్రలు, కోడిగుడ్లు ప్రభుత్వమే ఏర్పాటు చేయాలని, అన్ని బిల్లులను ప్రతీనెల 5వ తేదీలోగా చెల్లించాలన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో కూరగాయల ధరలు విపరీతంగా పెరిగిపోయాయని, ఇలాంటిపరిస్థితుల్లో బిల్లులు రాకపోవడం సిగ్గుచేట న్నారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 24వ తేదీన నిజామాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించతలపెట్టిన ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

'స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలి'

పెద్దబజార్, జూన్ 20: స్వామినాథన్ కమిషన్ సిఫారసులు వెంటనే అమలు చేయాలని ఏఐకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.ప్రభాకర్ అన్నారు. గురువారం నగరంలోని కోటగల్లిలోగల ఎన్ఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2024 సంవత్సరానికి గాను 14 రకాల పంటలకు మద్దతు ధరతో రైతుకు నిరాశ మిగిల్చిందన్నారు. జూన్ 19న కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ దేశంలో సాగు చేస్తున్న వంద పంటలకు 14 పంటలకు మాత్రమే మద్దతు ధర నామమాత్రంగా పెంచి ప్రకటిస్తున్న సందర్భంలో మోదీ రైతు పక్షపాతాన్ని రైతు ఆదాయాన్ని పెంచే విధంగా ఉన్నాయన్నారు. ఎన్నికల ప్రచారంలో, ప్రణాళికలో పేర్కొన్నట్లుగా ఈ మద్దతు ధర ప్రకటన నేపథ్యం లేదని నిరసన వ్యక్తం చేశారు. రైతుపెట్టుబడికి 50 శాతం కలిపి ధర నిర్ణయించి స్వామినాథన్ కమీషన్ సిఫారసును అమలు చేస్తామని రైతును రాజు చేస్తామని గొప్ప గొప్పలు చిలుక పలుకులు పలికి అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ మంత్రులు రైతులు పండించిన వంద రకాలకు పైగా పంటలకు కేవలం 14 రకాల పంటలకు మాత్రమే ధర నిర్ణయించారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి బాబన్న, దేవరాం, తదితరులు పాల్గొన్నారు.

మద్యానికి బానిసై ఆటోడ్రైవర్ ఆత్మహత్య

నవీపేట,జూన్20: మండలంలోని ఆశాజ్యోతి కాలనీకి చెందిన అయిటోళ్ల రాజు(30)అనే ఆటో డ్రైవర్ గురువారంపురుగుల మందును సేవించి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ యాదగిరి గౌడ్, స్థానికులు తెలిపిన ప్రకారం గతంలో ఉపాధి నిమిత్తం రాజు గల్ఫ్ దేశం వెళ్లాడు. తిరిగి స్వగ్రామానికి వచ్చిన అతడు ఆటో డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇటీవల మద్యానికి బానిసైన రాజు గురువారం తన ఇంట్లో గుర్తు తెలియని పురుగుల మందు సేవించగా వెంటనే అతనిని చికిత్స నిమిత్తం 108లో నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందాడు. మృతుడికి భార్య స్వప్న, 12సంవత్సరాల కుమారుడు ఉన్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రైల్వే పట్టాలపై పడేసిన ఆవును ఆసుపత్రికి తరలింపు

నిజామాబాద్ అర్బన్, జూన్ 20: నగరంలోని మాదవనగర్ క్యాన్సర్ ఆసుపత్రి వద్ద రైలు పట్టాలపై ఆవును పడేసిన విషయం తెలుసుకున్న విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు ఆ ఆవును ఆసుపత్రికి తరలించారు. ఆవు రైలు పట్టాలపై పడి ఉన్న సమాచారాన్ని తెలుసుకున్న విశ్వహిందూ పరిషత్ జిల్లా సహాయ కార్యదర్శి దాత్రిక రమేష్ తదితరులు ఆటో సహాయంతో కోటగల్లిలోని వెటర్నరీ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో ఆవుకు చికిత్స అందజేస్తున్నట్లు వారు తెలిపారు.

బడారామ్‌మట్ భూముల పరిశీలన

నిజామాబాద్ అర్బన్, జూన్ 20: నగరంలోని బడారాం మట్‌కు చెందిన భూములను మోపాల్ మండలం ముదక్‌పల్లి గ్రామంలోని సర్వేనెంబర్ 190లో రెండు ఎకరాల నాలుగు గుంటల వ్యవసాయ భూమిని దేవాదాయ శాఖ సిబ్బంది గురువారం పరిశీలించారు. గ్రామాభివృద్ధి కమిటీ సభ్యుల చేత ఇప్పటి వరకు కౌలు చేస్తున్న తూర్పునారాయణ అనే రైతును కలిసి కౌలు వివరాలు సేకరించారు. గ్రామాభివృద్ధి కమిటీ వారు ఈ భూమి కౌలును గ్రామాభివృద్ధికి ఇవ్వాలని బోరు వేయించి సౌకర్యం చేద్దామని 37 సంవత్సరాల నుంచి మార్కెట్ రేటుతో కౌలు రుసుము చెల్లించాలని వారి వద్ద వివరాలను ఫిట్‌పర్సన్ వేణుకు లేఖలు అందజేశారు. సిర్పూర్ గ్రామంలోని సర్వేనెంబర్ 646లో ఉన్న నాలుగు గుంటలు, 647లో ఉన్న రెండు ఎకరాల విస్తీర్ణాన్ని సాగుచేస్తున్న వెల్మల్ సాయిరెడ్డికి వారు చెల్లించిన రసీదులు తీసుకొని వచ్చి వాటిని చూపించి తదుపరి ఈ సంవత్సరంకు కౌలు చెల్లించాలని సూచించారు. న్యాల్‌కల్ గ్రామంలోని 662 సర్వే నెంబర్‌లోగల ఒక ఎకరం 19 గుంటల భూమిని కౌలుచేస్తున్న పంతుల సునీతకు గతంలో కౌలు చెల్లించిన రసీదులను చూపించి బకాయిలు కూడా చెల్లించాలని అధికారులు తెలియజేశారు. మాక్లూర్ మండలం బోర్గాం(కె)లోగల 556 సర్వే నెంబర్‌లో ఉన్న రెండు ఎకరాల మూడు గుంటల భూమిని గ్రామస్తులచే కౌలు విషయం మాట్లాడినట్లు దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు.

కన్నతండ్రిని చంపిన కొడుకుకు ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష

బోధన్‌రూరల్,జూన్20: మద్యం మత్తులో కన్నతండ్రిని చంపిన కొడుకుకు గురువారం బోధన్ కోర్టులో ఐదు సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ ఐదో అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్.రవికుమార్ తీర్పు వెల్లడించారు. బోధన్ కోర్టు లైజనింగ్ అధికారి శంకర్ తెలిపిన వివరాల ప్రకారం వర్ని మండలానికి చెందిన కాకలదాస్ తండా గ్రామ పంచాయతీకి చెందిన మాలవత్ ధూప్యనాయక్ భార్య గబ్బాబాయ్‌లు ముగ్గురు సంతానం. గోపాల్, వినోద్, నవీన్ కలరు. వినోద్ అనే వ్యక్తికి 5సంవత్సరాల క్రితం సంకబాయితో పెళ్లి అయింది. వారికి ఇద్దరు కుమారులు ఇంటి పక్కనే రేకుల షెడ్డులో ఉంటారు. వినోద్ కొంతకాలంగా చుట్టు పక్కల గ్రామాలలో దొంగతనాలు చేస్తూ పోలీసులకు దొరికిపోయి జైలుకు పోయి వచ్చాడన్నారు. దొంగతనాలు చేయొద్దని చెప్తున్న తనభార్య సంకబాయితో నాన్నతో గొడవపడ్డాడు. ఈ మధ్యనే వినోద్ ఓ దొంగతనం కేసులో బాన్సువాడ పోలీసులు జైలుకు పంపగా వారంలోనే తిరిగి వచ్చాడని తెలిపారు. 3-6-2021నాడు సుమారు 10:20నిమిషాల్లో బాగా తాగి ఇంటికి వచ్చి తన గుడిసెలో తన భార్య సంకబాయి అనవసరంగా గొడవ పడి కర్రతో కొడుతున్న అది చూసి నాన్న ధూప్య అడ్డుకోగా నీకెందుకు అంటూ తన చేతిలో ఉన్న కర్రతో నాన్నను తలపై కొట్టగా తీవ్ర గాయాల పాలై చికిత్స పొందుతూ మృతిచెందాడని తెలిపారు. ఇట్టి విషయంలో మాలవత్ ధూప్యనాయక్ కుమారుడైన గోపాల్ 4-6-2021న వర్ని పోలీసులకు ఫిర్యాదుచేయడం వల్ల అప్పటి ఎస్ఐ అనిల్ రెడ్డి కేసు నమోదు చేసి ఇన్విస్టిగేషన్ చేసి అశోక్‌రెడ్డి సీఐ చార్జిషీట్ వేయడం జరిగిందన్నారు. పోలీసుల తరపున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్యామ్‌రావు వాదించడం వల్ల గురువారం 5వ అదనపు జిల్లా సెషన్ జడ్జి రవికుమార్ ఐదేళ్ల కఠిన కారాగార జైలుశిక్ష, వెయ్యిజరిమాన విధించారు. జరిమాన చెల్లించని పక్షంలో 18నెలల సాధారణ జైలు జీవితం అను భవించాల్సిందిగా తీర్పును వెల్లడించారు. కేసులో బోధన్ ఏసీపీ శ్రీనివాస్, రుద్రూర్ సీఐ జయేష్ రెడ్డి, కృష్ణకుమార్, లింగంప్రసాద్ తదితరులున్నారు.

జిల్లా వ్యాప్తంగా నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీ

బీబీపేట, జూన్ 20: మండల కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా విద్యార్థులకు అల్బెండాజోల్ మాత్రలను పంపిణీ చేశారు. బీబీపేట హరిజనవాడలోని ప్రాథమిక పాఠశాలలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు ఆరోగ్యవంతంగా ఎదగడానికి ప్రభుత్వం నులి పురుగుల మందులను ఉచితంగా సరఫరా చేస్తుందని 3 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాల వయస్సు వరకు ఈ మందులను వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి భానుప్రియ, సూపర్‌వైజర్, ఆరోగ్య కార్యకర్తలు హరిప్రసాద్, సుధారాణి, ఆశావర్కర్లు శ్రీలత, కవిత, గంగాజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

బీర్కూర్: ఒకటి నుంచి 19ఏళ్ల పిల్లలందరికీ తప్పనిసరిగా అల్బెండాజోల్ మాత్రలు వేయించాలని వైద్యుడు గిరీష్, సీహెచ్‌వో రవీందర్‌లు ఆరోగ్య సిబ్బందికి సూచించారు. గురువారం బీర్కూర్, నసురుల్లాబాద్ ఉమ్మడి మండలాల్లోని ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలను సందర్శించి పిల్లలకు అల్బెండాజోల్ మాత్రలు అందజేసి వారి చేత మింగించారు. ఈ సందర్భంగా వైద్యుడు గిరీష్ మాట్లాడుతూ ఉమ్మడి మండలాల్లో 1-19 ఏళ్ల పిల్లలందరికీ అల్బెండాజోల్ మాత్రలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. అన్ని గ్రామాల్లో పిల్లలకు ఏఎన్ఎంలు, ఆశలు, అంగన్‌వాడీ కార్యకర్తలు మాత్రలు వేశారన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యుడు గిరీష్, సీహెచ్‌వో రవీందర్, సూపర్‌వైజర్‌లు ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మద్నూర్: ఉమ్మడి మద్నూర్ మండలంలోని ప్రభుత్వ ప్రైవేట్, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు నులి పురుగుల నివారణ కోసం



బీబీపేటలో విద్యార్థులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

అల్బెండాజోల్ మాత్రలను డోంగ్లీ పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డోంగ్లీ పీహెచ్‌సీ సూపర్‌వైజర్ రవి మాట్లాడుతూ మాత్రలు వేసుకునే విధానంపై పిల్లలకు అవగాహన కల్పించారు. ఈ వ్యాధి సోకిన పిల్లల్లో శారీరక, మానసిక ఎదుగుదల లోపిస్తుందని వ్యాధిని గుర్తించి మాత్రలు వేసినట్లయితే నులి పురుగుల వ్యాధి నుంచి కాపాడవచ్చని సూచించారు. మద్నూర్ మండలంలోని పెద్ద తడ్గూర్, కొడిచిర, మద్నూర్ గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో అల్బెండాజోల్ మాత్రలను పంపిణీ చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ లక్ష్మీ, ఏఎన్ఎం పుష్ప, ఆశా వర్కర్ శ్యామల, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భిక్కనూరు: మండలంలోని అన్ని గ్రామాల్లోని పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ సెంటర్లలో అల్బెండాజోల్ మాత్రలను వేశారు. ఈ మేరకు ఎంపీపీ గాల్‌రెడ్డి, మండల వైద్యాధికారిణి యేమిమా మాట్లాడుతూ 19 సంవత్సరాలలోపు పిల్లలకు తప్పకుండా అల్బెండాజోల్ మాత్రలను తప్పకుండా వేయించాలన్నారు.

దోమకొండ: మండలంలోని అంబార్‌పేట సబ్ సెంటర్‌లోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అల్బెండాజోల్ మాత్రలు ఎంపీహెచ్‌వో వినోద్ కుమార్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ విశాల్, ఎంపీహెచ్ఏ డెబోరా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి: పరిశుభ్రత పాటించడం వల్ల రోగాల బారి నుంచి రక్షించుకోవచ్చని ఎల్లారెడ్డి ఎంపీపీ మాధవి అన్నారు. మత్తమాల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఎల్లారెడ్డి ఎంపీపీ మాధవి అల్బెండాజోల్ మాత్రలను వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కడుపులో నట్టల నివారణకు ఈ మాత్రలను వేసుకోవాలన్నారు.

నాగిరెడ్డిపేట: మండలంలోని అల్బెండాజోల్ మాత్రల పంపిణీ పూర్తయిందని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సృజన్ కుమార్ తెలిపారు. మండలంలో 6,647 ఉండగా అందులో 5,916 మంది పిల్లలకు మాత్రలు వేయడం పూర్తయినట్లు తెలిపారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో స్థానిక ఎంపీపీ వినీత, జడ్పీటీసీ మనోహర్‌రెడ్డిలు విద్యార్థినులకు నులి పురుగు నివారణ మాత్రలు వేశారు.

నసురుల్లాబాద్: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో అల్బెండాజోల్ మాత్రలను ఎంపీడీవో నీలావతి విద్యార్థినులకు అందించారు. అనంతరం వైద్య సిబ్బంది మండల పరిధిలోని వివిధ గ్రామాలలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు నులి పురుగుల నివారణ మందులను పంపిణీ చేశారు.

'కేంద్ర ప్రభుత్వం పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలి'

బాన్సువాడ టౌన్, జూన్ 20: కేంద్ర ప్రభుత్వం ఈపీఎస్ 95 పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యదర్శి శంకర్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కనీస పెన్షన్ రూ.7500లతో పాటు కరువు భత్యం చెల్లించాలన్నారు. దాదాపు 10 సంవత్సరాలుగా దేశవ్యాప్తంగా ఆందోళన చేస్తున్నారని, అయినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. కేంద్రం తమ సమస్యను పరిష్కరించకపోతే ఆందోళన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.

రేపు టీటీడీలో శ్రీవారికి రథోత్సవం

బీర్కూర్, జూన్ 20: మండలంలో తిమ్మాపూర్ గ్రామ సమీపంలోని తెలంగాణ తిరుమల దేవస్థానం సన్నిధిలో శనివారం పౌర్ణమి సందర్భంగా రథోత్సవం నిర్వహిస్తున్నారు. పౌర్ణమి సందర్భంగా ఆలయ మాడ వీధుల్లో సాయంత్రం 7 గంటలకు గరుడ వాహనంపై స్వామి వారి రథోత్సవ కార్యక్రమం ప్రారంభమవుతుందని కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి రథోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

వాహనాల వేలం పాట

కామారెడ్డి టౌన్, జూన్ 20: కామారెడ్డి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని హీరోహోండా స్పెండర్, ట్రాలీ ఆటో వాహనాలకు శుక్రవారం ఉదయం 11 గంటలకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. ఈ వాహనాలకు ప్రారంభ ధర రూ.25 వేలు, ట్రాలీ ఆటో రూ.1,25,000గా నిర్ణయించినట్లు తెలిపారు. 18 శాతం జీఎస్‌టీ కూడా కలదని తెలిపారు. ఆసక్తి గల వారు రూ.5వేలు డిపాజిట్ చేసి తమ పేరు నమోదు చేసుకోగలరని సీఐ విజయ్‌కుమార్ తెలిపారు.

విద్యార్థినికి ద్విచక్రవాహనం ఢీ

బీర్కూర్, జూన్ 20: మండలంలోని దామరంచ ప్రభుత్వ పాఠశాలలో సరయు అనే విద్యార్థిని ఆరవ తరగతి చదువుకుంటుంది. గురువారం పాఠశాల నుంచి కిరాణాషాపుకు వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో సరయుకు స్వల్ప గాయాలయ్యాయి. ఆమెను వెంటనే బాన్సువాడ ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. పాఠశాల ఎదుట ప్రధాన రహదారి ఉందని, స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేయాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు.

అనారోగ్యంతో వృద్ధుడి ఆత్మహత్య

రామారెడ్డి, జూన్ 20: రామారెడ్డి మండల కేంద్రానికి చెందిన దండే బోయిన నర్సయ్య(78) అనే వృద్ధుడు ఆరోగ్యం బాగాలేక ఇంట్లో దూలానికి ఉరేసుకుని మృతి చెందినట్లు ఎస్ఐ కొండ విజయ్ తెలిపారు. వృద్ధుడు ఎలాంటి పని చేయలేని స్థితిలో ఉండి అనారోగ్యంతో బాధపడుతున్నట్లు తెలిపారు. గత మూడు సంవత్సరాల క్రితం తన కొడుకు, కోడలు చనిపోయిన విషయంలో తీవ్ర మనస్థాపానికి గురై జీవితంపై విరక్తిచెంది తన ఇంట్లోనే ఉరి వేసుకున్నట్లు తెలిపారు. మృతుడి భార్య కళావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఐదుగురిపై కేసు నమోదు

తాడ్వాయి, జూన్ 20: మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన ఐదుగురిపై గురువారం కేసు నమోదైనట్లు ఏఎస్ఐ సంజీవ్ తెలిపారు. గ్రామానికి చెందిన తిరుపతి, సంగయ్యలపై నర్సారెడ్డి, కపిల్, ఆనంద్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, ధర్మారెడ్డిలు దాడిచేసి కొట్టారని ఏఎస్ఐ తెలిపారు. నర్సారెడ్డి నిర్మిస్తున్న ఇల్లు గ్రామ పంచాయతీ స్థలంలోకి వస్తుందని పలుమార్లు నర్సారెడ్డిని ఇంటి నిర్మాణం ఆపాలని పలుమార్లు గ్రామస్థులు తెలిపినా నిర్మాణం నిలిపివేయలేదు. గురువారం తిరుపతి, సంగయ్య ఇంటి నిర్మాణం ఆపాలని నర్సారెడ్డికి సూచించడంతో ఆయన తిరగబడి ఇద్దరిపై మరో నలుగురితో కలిసి దాడి చేయడంతో వారికి తీవ్ర గాయాలైనట్లు తెలిపారు. ఈ విషయమై తిరుపతి, సంగయ్యలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

తాడ్వాయి, జూన్ 20: మండలంలోని పల్లెగడ్డ తండాకు చెందిన నునావత్ విఠల్ గేదె గురువారం విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. గ్రామానికి చెందిన విఠల్ గేదె రూ.95వేలు విలువ ఉంటుందని తెలిపారు. అధికారులు స్పందించి బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చోరీకి పాల్పడిన వ్యక్తికి రిమాండ్

ఎల్లారెడ్డి, జూన్ 20: ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని అయ్యప్ప ఆలయంలో గతంలో చోరీకి పాల్పడిన నిందితుడిని పట్టుకుని రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై మహేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయంలోని సీసీ ఫుటేజీ ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా నిందితుడు లింగంపేట మండలం ఎక్కపల్లి తండాకు చెందిన ఎం.గణేష్‌ను పట్టుకున్నట్లు తెలిపారు. గతంలో నాగిరెడ్డిపేట, లింగంపేట, తాడ్వాయి వివిధ పోలీసు స్టేషన్‌లలో పలు దొంగతనాలు చేసి సోలార్ ప్లేట్లు విద్యుత్ తీగలు ఆలయాల్లో దోపిడీలు చేసినట్లు తెలిపారు.

ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా మోహన్‌నాయక్

కామారెడ్డి టౌన్, జూన్ 20: కామారెడ్డి జిల్లా లంబాడ హక్కుల పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షుడిగా రేతహస్ మోహన్‌నాయక్‌ను జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు తేజావత్ బెల్లయ్య నాయక్ నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి ఉపాధ్యక్ష పదవి ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు. బంజారా సమస్యలపైన జిల్లాలో తండాలల్లో తిరుగుతూ బంజారా భాషను రాజ్యాంగంలో 8వ షెడ్యూల్లో చేర్చాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు కోటియా నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాణాప్రతాప్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే సమాజంలో గుర్తింపు : ఎమ్మెల్యే పోచారం

బాన్సువాడ, జూన్ 20: విద్యతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం బాన్సువాడ పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో నూతనంగా నిర్మిస్తున్న భవన నిర్మాణ పనులను, మూత్రశాలలను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో బాన్సువాడ మండలం సోమేశ్వరం గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ వైద్యులు కుటుంబ సభ్యులు ఆసుపత్రికి అందించిన పరికరాలను, అదే విధంగా ప్రభుత్వ ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలను ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా పట్టణంలోని జూనియర్ కళాశాలను పరిశీలించారు.

రోగులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి

ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి మధ్యాహ్న భోజన నిర్వాహకుడిపై మండిపడ్డారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య పరీక్షలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రోగులకు తమకు ఉదయం అల్పాహారం సరిగ్గా అందడం లేదని భోజనం సక్రమంగా పెట్టడం లేదని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే మధ్యాహ్న భోజన



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పోచారం

నిర్వాహకుడిని అక్కడికి పిలిపించి రోగులకు నాణ్యమైన భోజనాన్ని అందించాల్సిందేనని లేకపోతే మానుకోవాలని ఆదేశించారు. ఇడ్లీ, వడలతో పాటు ప్రతిరోజు ఒక మెనూ ప్రకారం అల్పాహారంతో పాటు భోజనాన్ని కూరగాయలను అందించాలని నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని ఆగ్రహించారు. ఇప్పటికైనా తీరు మార్చుకోకుంటే ఆసుపత్రి సూపరింటెండెంట్ చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

● ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు



ఇంజనీరింగ్ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఎల్లారెడ్డి, జూన్ 20: ప్రజలకు అధికారులు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పూర్తి చేయాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు అన్నారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రెవెన్యూ పంచాయితీ రాజ్, ఇరిగేషన్, విద్యుత్ శాఖ, డీఆర్‌డీవో, అంగన్‌వాడీ వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్లారెడ్డి పట్టణ పరిధిలో నిర్మిస్తున్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణాలను పూర్తి చేసి లబ్దిదారులకు అందజేయాలని అధికారులకు ఆదేశించారు. వర్షాకాలం ప్రారంభం అయినందున నీటిపారుదల శాఖ అధికారులు చెరువుల్లో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అదే విధంగా నియోజకవర్గంలో కాళేశ్వరం 22వ ప్యాకేజీపై రక్షణ చేశారు. ప్యాకేజీ అవసరం ఉన్న నిధులపై చర్చించారు. పోచారం ప్రాజెక్టు సుందరీకరణకు, పూడికతీత అంశాలపై సమీక్షించారు. విద్యుత్ శాఖ అధికారులపై ప్రజలు చేస్తున్న ఫిర్యాదులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. గ్రామాలలో విద్యుత్ అంతరాయం జరిగితే సంబంధిత అధికారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ధరణిలో ఉన్న సమస్యలను పోడు భూముల పట్టాల పంపిణీపై కార్యాలయంలో అధికారులు ఎటువంటి అవినీతికి పాల్పడిన ఉపేక్షించేది లేదని ప్రజలకు నిత్యం అవసరం ఉండే వాటిని వెంటవెంటనే పూర్తి చేయాలని అన్నారు. అంగన్‌వాడీలలో గర్భిణీలకు పౌష్టికాహారం అందించాలని అంగన్‌వాడీ భవన నిర్మాణాలకు సంబంధించిన ప్రతిపాదనలు తయారు చేయాలని తెలిపారు. అర్హత ఉన్న ప్రతి లబ్దిదారులకు పెన్షన్లు మంజూరు చేయాలని, పెండింగ్‌లో ఉన్న క్రీడా ప్రాంగణాలను పూర్తి చేయాలని ఉపాధిహామీ కూలీలకు వేతనాలు చెల్లింపులో జాప్యం జరగకూడదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మన్నే ప్రభాకర్, వివిధ శాఖల ఇంజనీర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందించాలి

మద్నూర్, జూన్ 20: నియోజకవర్గంలోని పేదలందరికీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందించే బాధ్యత కార్యకర్తలపై ఉందని జుక్కల్ శాసన సభ్యుడు లక్ష్మీకాంతారావు అన్నారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయా మండలాల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రణాళికలతో పని చేయాలని ఆయన నాయకులకు దిశా నిర్దేశం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసం అందజేస్తున్న సంక్షేమ పథకాలను వారికి అందే విధంగా కృషి చేయాలని సూచించారు.

'ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్ట్ పనుల పూర్తికి షబ్బీర్ అలీ కృషి'

దోమకొండ, జూన్ 20:ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు పనులు పూర్తి చేయడానికి షబ్బీర్‌అలీ కృషి చేస్తున్నారని జడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, మండల పార్టీ కాంగ్రెస్ నాయకులు రావులపల్లి నర్సారెడ్డి, ఐరేని నర్సయ్య, అండెం శంకర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కాంగ్రెస్ పభుత్వ హయంలోనే షబ్బీర్‌అలీ కృషి వలన 20వ ప్యాకేజీ పనులు పూర్తి అయ్యాయని, 21 ప్యాకేజీ పనులు 70 శాతం పూర్తి అయినట్లు తెలిపారు. రిజార్వాయర్ మాసాని ట్యాంక్ నుంచి కొండము చెరువు వరకు పూర్తి చేయడం జరిగిందని,భూంపల్లి ట్యాంక్ నుంచి లిఫ్ట్ కోసం టర్నల్ పంపు మరమ్మతులు చేపట్టి ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు ద్వారా కామారెడ్డి, ఎల్లారెడ్డి రెండు నియోజకవర్గాలకు త్రాగునీరు, సాగునీరు అందించేందుకు ప్రభుత్వ సలహదారు షబ్బీర్‌అలీ 21,22 ప్యాకేజీ పనుల నిమిత్తం కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల ఈరిగేషన్ అధికారులతో సమస్యలను తెలుసుకుని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పనులు పూర్తి చేయించడానికి ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు.

మండల స్థాయి నాయకులతో ఎమ్మెల్యే సమీక్ష

నిజాంసాగర్, జూన్ 20: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్ రావు బిచ్కుంద, మద్నూర్, జుక్కల్ మండల స్థాయి నాయకులతో సమీక్ష నిర్వహించారు. పార్టీ నిర్మాణం, సమస్యలు తదితర వాటిపై చర్చించారు. క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రణాళికలతో పనిచేయాలని దిశా నిర్దేశం చేశారు.

మండల సమీకృత భవనాన్ని పరిశీలించిన ఆర్డీవో

నసురుల్లాబాద్, జూన్ 20: మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న మండల సమీకృత భవనాన్ని గురువారం ఆర్డీవో రమేష్ రాథోడ్ పరిశీలించారు. అనంతరం స్థానిక కాంట్రాక్టర్లతో మాట్లాడుతూ మండల అనుబంధ సంస్థల కార్యాలయల కోసం నిర్మిస్తున్న ఈ భవనాన్ని తొందరలో పనులు పూర్తి చేయాలని ఆయన స్థానిక కాంట్రాక్టర్లకు తెలిపారు. వచ్చే నెల రెండవ తేదీ వరకు సమీకృత భవనాన్ని పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తామని కాంట్రాక్టర్లు ఆర్డీవోకి తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ బావయ్య, వైస్ ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి, వంగ లక్ష్మీనారాయణగౌడ్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన నాయకులు

నిజాంసాగర్, జూన్ 20: జహీరాబాద్ ఎంపీ సురేష్ శెట్కార్‌ను గురువారం నిజాంసాగర్ మండల నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల ఎంపీగా భారీ విజయం సాధించడంతో మర్యాద పూర్వకంగా కలిసినట్లు ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడు బానోత్ లోక్యానాయక్, మహ్మద్‌నగర్ మండల మహిళా అధ్యక్షురాలు శారద, మాజీ సర్పంచ్ సవాయిసింగ్‌లు తెలిపారు.

'విద్యారంగ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి'

బాన్సువాడ, జూన్ 20: నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైన విద్యారంగ సమస్యలు, విద్యార్థుల సమస్యలు పరిష్కరించాల్సిన ప్రభుత్వం విఫలమైంది. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో, కళాశాలల్లో ఫీజులను నియంత్రించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు కామారెడ్డి జిల్లా ఇంచార్జి ఎన్.బాల్‌రాజ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్షణమే ప్రభుత్వం ఫీజులను నియంత్రించాలి, కామన్ ఫీజ్ విధానం తీసుకురావాలని, దాదాపు గత మూడు సంవత్సరాల నుంచి విద్యార్థుల యొక్క ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు పెండింగ్‌లో ఉన్నాయి. దీని వల్ల పేద, మధ్య తరగతి విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. విద్యకు దూరమయ్యే పరిస్థితి నెలకొంటుంది. అదే విధంగా రాష్ట్రంలో సాంఘిక సంక్షేమ హాస్టళ్ళు చాలా చోట్ల అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. దీని వల్ల సౌకర్యాలు కరువై విద్యార్థులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కావున తక్షణమే సంక్షేమ హాస్టళ్ళకు సొంత భవనాలు నిర్మించాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రధానంగా రాష్ట్ర ప్రభుత్వం గతంలో విడుదల చేసిన డీఎస్సీ 11062 పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వడం జరిగింది. ఇప్పుడు ప్రమోషన్లు ఇవ్వగా మిగిలిన పోస్టులు (6000లకుపైగా) కూడా ఈ నోటిఫికేషన్‌కి కలిపి మెగా డీఎస్సీ అని ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని ఈ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే కొత్తగా టెట్ క్వాలిఫై అవుతున్న విద్యార్థులకు డీఎస్సీకి సన్నద్ధం కావడానికి తగిన సమయం ఇవ్వాల్సిందిగా ఈప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కావున ప్రభుత్వం ఇప్పటికైనా విద్యార్థుల సమస్యలను దృష్టిలో పెట్టుకుని విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఇందిరమ్మ ఇళ్లలో అవినీతికి పాల్పడిన వారికి జైలు

లింగంపేట, జూన్ 20: మండలంలోని ఉమ్మడి శెట్పల్లిసంగారెడ్డి పంచాయితీ పరిదిలో ఇందిరమ్మ ఇండ్లలో రూ.62లక్షలు అవినీతి జరిగిందని కోర్టులో రుజువు కావడంతో దీనికి సంబంధించిన అధికారులతో పాటు ఇద్దరు గ్రామ వాలింటర్లకు మూడు సంవత్సరాల జైలు శిక్ష, రూ.10వేలు జరిమినాను కోర్టు విధించినట్లు ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పాలనలో ఇండ్లులేని పేదలకు ఇండ్లు నిర్మించుకునేందుకు ఇందిరమ్మ పథకం కింద ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి. కొందరు అధికారులు దీనిని అసరగా చేసుకుని 2009లో లబ్దీదారులతో ఒప్పందం చేసుకుని గ్రామంలో 90ఇండ్లు నిర్మించకుండానే బిల్లులు లేపినట్లు ఫిర్యాదులు రావడంతో పాటు లబ్దీదారుల సంతకాలను ఫోర్జరీచేసి బిల్లులు తీసుకున్నట్లు ఫిర్యాదులు వచ్చాయి. విచారణ జరిపిన డీఈఈ శెట్పల్లిసంగారెడ్డి పంచాయితీ పరిదిలోని ఎక్కపల్లి, ఎక్కపల్లితాండ, సజ్జన్‌పల్లి, లొంకల్‌పల్లి, మాలపాటి తదితర గ్రామాలలో విచారణ జరిపి రూ.62లక్షలు అవినీతి జరిగినట్లు నివేదిక ఇచ్చారు. దీంతో అప్పటి గృహనిర్మాణ శాఖ ఈఈ చైతన్యకుమార్ దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు గృహనిర్మాణ శాఖ అధికారులతో పాటు గ్రామ వాలింటర్లపై కేసలు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుపై విచారణ జరిపిన ఎల్లారెడ్డి మున్సిఫ్ కోర్టు మెజిస్ట్రేట్ హారిక బుధవారం తీర్పును వెలువరించారు. 15పంవత్సరాలకు అప్పటి గృహనిర్మాణ శాఖ ఏఈలు సంపత్‌కుమార్, బికేలాల్‌లతో పాటు గ్రామవాలింటర్లు వజ్రమ్మ, రాజమణిలకు మూడు సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.10వేలు జరిమాన విధించినట్లు ఎస్సై తెలిపారు.

'ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు చేరాలి'

నాగిరెడ్డిపేట, జూన్ 20: మండలానికి నూతనంగా మంజూరైన ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనే మండల విద్యార్థులు అడ్మిషన్లు తీసుకోవాలని జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి మండల విద్యార్థులను కోరారు. మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల లేకపోవడంతో గత సంవత్సరం 2023లో అప్పటి తెలంగాణ ప్రభుత్వం మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంజూరు చేసింది. ఈ కళాశాలను ప్రస్తుతం స్కూల్ భవనంలో ప్రారంభించారు. ఈ ఆర్థిక సంవత్సరం 2024-25 నుంచి ఈ కళాశాలలో విద్యాబోధన ప్రారంభించనున్నారు. ప్రస్తుతం అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతుంది. ఈ నూతన కళాశాలలో జరుగుతున్న అడ్మిషన్ల ప్రక్రియను స్థానిక ఎంపీపీ వినీతతో కలిసి గురువారం మనోహర్‌రెడ్డి కళాశాల సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు కళాశాలలో కేవలం 42 మంది విద్యార్థులు అడ్మిషన్లు తీసుకున్నట్లు సిబ్బంది వివరించారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్ విష్ణు తదితరులు పాల్గొన్నారు.

'అధిక ఫీజుల వసూలుపై చర్యలు తీసుకోవాలి'

ఎల్లారెడ్డి, జూన్ 20 : ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలో అధికంగా ఫీజు వసూలు చేస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఎల్లారెడ్డి ఏబీవీపీ నాయకులు అన్నారు. గురువారం ఎల్లారెడ్డిలో వారు మాట్లాడుతూ నిబంధనలకు వ్యతిరేకంగా పాఠశాలలో బుక్స్, యూనిఫాం అమ్ముతున్న యాజమాన్యాలపై విద్యాహక్కు చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని అన్నారు.

నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలపై సుప్రీంకోర్టు జడ్జీతో విచారణ జరిపించాలి

కామారెడ్డి టౌన్, జూన్ 20: నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలపై సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్ డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా నిర్వహించిన నీట్ పరీక్షల్లో అవకతవకలు జరిగాయని పేపర్‌లీక్ చేయించి 720 మార్కులకు 720 మార్కులు 69 మందికి ఒకే సెంటర్‌లో సీరియల్ నెంబర్ గల విద్యార్థులకు రావడం అనుమానాలకు తావిస్తోందని అన్నారు. ఎన్‌టీఏ అవలంభిస్తున్న విధానాల కారణంగా కూడా పరీక్షలపై విశ్వసనీయత కోల్పోవాల్సి వస్తుందని అన్నారు. బీహార్ రాష్ట్రంలోని పాట్నాలో గత నెల 4న పేపర్‌లీక్ అయిందని 13 మందిని పోలీసులు అరెస్ట్ చేశారని అన్నారు. పేపర్‌లీకేజీలో గుజరాత్ రాష్ట్రంలో ఎడ్యుకేషన్ అధినేత పురుషోత్తం రాయ్ అనే వ్యక్తి అని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని తెలిపారు. ఈ పేపర్ లీకేజీలు సీరియస్‌గా కేంద్ర ప్రభుత్వం తీసుకుని భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు రాకుండా ఉండేవిధంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు.

ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు

సదాశివనగర్, జూన్ 20: మండల కేంద్రంలో గల ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు ఈనెల 21న స్పాట్ అడ్మిషన్‌లు నిర్వహిస్తున్నట్లు భానుమతి తెలిపారు. బైపీసీలో 15, సీఈసీలో 12 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

శాంతి - ఓసీ
దర్శన్ - మహారాజ
ప్రియా 70 - మనమే
ప్రియా 35 - హరోంహర

బాన్సువాడ

మహేశ్వరి - ఓఎంజీ
వెంకటేశ్వర - హరోంహర

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	160	200	220
వెన్‌కాబ్(కిలో)	:	170	220	230

